


కాగజ్‌నగర్ భగత్‌సింగ్ రోడ్‌లో మహిళల నృత్యాలు



పెద్దవాగులో గణేష్ విగ్రహం నిమజ్జనం చేస్తున్న మండలి సభ్యులు



కాగజ్‌నగర్ పెద్దవాగులో నిమజ్జనం చేసిన గణనాథ విగ్రహం



కౌటాల సమీపంలోని ప్రాణహితలో గణనాథుడిని నిమజ్జనం చేస్తున్న యువకులు



పెద్దవాగులో గణేష్ విగ్రహం నిమజ్జనం చేస్తున్న కుటుంబ సభ్యులు

బై బై గణేశా..

- అంబరాన్నంటిన గణపయ్య నిమజ్జనం
- ఆకట్టుకున్న శోభాయాత్ర
- భారీ బందోబస్తు నిర్వహించిన పోలీసులు

కాగజ్‌నగర్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్‌లో శనివారం వినాయక నిమజ్జన వేడుకలు అంబరాన్ని అంటాయి. పట్టణంలో 150 విగ్రహాలను ఆయా వార్డుల్లో నెలకొల్పారు. శనివారం వివిధ పూజ కార్యక్రమాలను నిర్వహించి అనంతరం అన్నదాన కార్యక్రమాలను చేపట్టారు. అలాగే ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేసుకొని గణనాథ విగ్రహాలను శోభయాత్రగా తరలించారు. పట్టణ వీధుల గుండా సాగి అనంతరం పెద్దవాగులో నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు. పెద్దవాగులో అధికారులు క్రేన్‌ను ఏర్పాటు చేసి విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా ప్రతీ విగ్రహానికి పోలీసులు ముందస్తుగానే రూట్ మ్యాప్ ఇచ్చారు. ఈ రూట్ మ్యాప్ ద్వారా విగ్రహాలను తరలించారు. నిమజ్జనం సందర్భంగా వయోబేధం లేకుండా అంతా కలిసి నృత్యాలు చేస్తూ పెద్ద వాగు నిమజ్జనం చేశారు.

వినాయ విగ్రహాల వద్ద ప్రముఖుల పూజలు

కాగజ్‌నగర్: కాగజ్‌నగర్ పట్టణంలో శనివారం వినాయక నిమజ్జనం సందర్భంగా పట్టణ ప్రముఖులు పూజలు చేశారు. హిందూ ఉత్సవ సమితి ఆధ్వ ర్యంలో లారీ చౌరస్తాలో ఏర్పాటు కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండే విఠల్, సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ పూజలు చేశారు. మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప భక్తులకు ప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ కోసిని మండపంలో పూజలు చేశారు. అనంతరం పెట్రోలు పంపులో గణనాథ మండలి వద్ద భక్తులకు ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహిచంచారు.

కెరమెరి: మండలంలోని గోయగాం గ్రామంలో గణణాథుడిని ఘనంగా నిమజ్జనం చేశారు. మండలీ వద్ద ఏర్పాటు చేసిన లడ్డుకు వేలం నిర్వహించగా విజయ్ అనే వ్యక్తి వేలంపాటలో 26,100 రూపాయలకు దక్కించు కున్నారు. కార్యక్రమంలో గ్రామ పటేల్ శంకర్, లక్ష్మణ్, పాండురంగ్, బాపూజీ, రాందాస్, దిలీప్ పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ దండే విఠల్, సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు

సిర్పూర్(టి): మండల కేంద్రంలో ప్రతిష్ఠించిన గణనాథులను మండల కేంద్రంలోని నాగమ్మ చెరువులో నిమజ్జనం చేశారు. ఎస్సై కమలాకర్, తహసీల్దార్ రహీముద్దీన్, ఎంపీడీవో సత్యనారాయణ, ఈవో తిరుపతి నాగమ్మ చెరువు వద్ద నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు చేపట్టారు.

జైనూర్: మండల కేంద్రంలో గణనాథుడికి మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథ్‌రావ్‌తో కలిసి భక్తులు పూజలు చేశారు. లడ్డూకు వేలం పాట నిర్వహించగా జైనూర్‌కు చెందిన ముత్యపువార్ విశ్వనాథ్ 92,151 రూపా యలకు దక్కించు కున్నాడు. కాసు పటేల్ గూడ సమీప చెరువులో నిమజ్జనం చేశారు. సీఐ వెల్పుల రమేష్ అధ్వర్యంలో ఎ స్సై రవికుమార్ భారీ బందో బస్ ఏర్పాటు చేశారు. సహకార చైర్మన్ కొడప హన్ను పటేల్, మేస్రాం అంబాజీ, రమేష్, ప్రహ్లాద్, ఆత్రం భీంరావ్, ముండె వెంకటి, సంజయ్ పాల్గొన్నారు.

సిర్పూర్(యు): మండల కేంద్రంలో గల సర్వజనిక్ గణేష్ మండలి అధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడికి గ్రామ పటేల్ ఆత్రం ఆనంద్‌రావు, ఎస్సై రామకృష్ణ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆత్రం భగవంత్ రావు ప్రత్యేక పూజలు నిర్వహించి గణేష్ శోభయాత్రను ప్రారంభించారు. గణపతి లడ్డు వేలం వేయగ 15,551 రూపాయాలకు జిన్నవార్ అనిల్‌కుమార్ దక్కించుకున్నారు. సర్వజనిక్ గణేష్ మండలి సభ్యులు ఆత్రం నితీన్‌కుమార్, కమలకార్, సురేష్, పుండలిక్, తోడసం, జైమన్, మాజీ సర్పంచ్ ఆత్రం ఓంప్రకాష్, కనక ఆనంద్, జన్నవార్ అనూప్, ఆత్రం గంగారాం, కోట్నాక పాండురంగ్ తదితరులు పాల్గొన్నారు.

దహెగాం: మండలంలోని లగ్గాం, ఒడ్డుగూడ, ఖర్జీ, చిన్న అయినం, దహెగాం మండల కేంద్రంలోని ఎస్సీవాడలో గణనా థులను భక్తులు నిమజ్జనం చేశారు.

కౌటాల: మండలంలోని వినాయకులను పెన్‌గంగా, ప్రాణ హిత నదులతో పాటు దగ్గరలోని చెరువుల్లో నిమజ్జనం చేశారు.

వాంకిడి: మండల కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల ప్రధాన కూడళ్ల ద్వారా సమీపంలో వాగుల్లో, చెరు వుల్లో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. సీఐ సత్యనారాయణ, ఎస్సై మహెం దర్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.



పెద్దవాగులో గణనాథుడిని నిమజ్జనం చేస్తున్న ఎస్పీ కాంతిలాల్ పాటిల్, ఆయన సతీమణి

గణేష్ నిమజ్జనంలో పాల్గొన్న ఎస్పీ

ఆసిఫాబాద్ (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ పట్టణ సమీపంలోని పెద్దవాగు నదిలో గణేష్ నిమజ్జన కార్యక్రమంలో ఎస్పీ కాంతిలాల్ పాటిల్ కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ప్రతిష్ఠించిన మట్టి గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తి శ్రద్ధలతో పెద్దవాగు వద్ద నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్నారు.



కెరమెరి మండలంలో నిమజ్జనానికి తరలుతున్న గణనాథుడు



పూజలు చేస్తున్న సిర్పూరు మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప



ప్రసాద వితరణ చేస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్



వినాయకుడి నిమజ్జన శోభాయాత్రలో పాల్గొన్న మహిళలు

ఏఎన్ఎంను విధుల్లోకి తీసుకోవాలి

తిర్యాణి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని పంగిడి మాదర ఆశ్రమ పాఠశాల ఏఎన్ఎంను విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ సీఐటీయూ నాయకులు డీఆర్‌వోకు వినతిపత్రం అందజేశారు. ఆశ్రమ పాఠశాలలో విద్యార్థి మరణానికి ఏఎన్ఎంను బాధ్యురాలిని చేస్తూ ఆమెను విధుల నుంచి తొలగించారని ఇది సరైన పద్ధతి కాదన్నారు. హెడ్‌మాస్టర్, వార్డెన్ పూర్తి బాధ్యత వహించాల్సి ఉండగా వారిని సస్పెండ్ మాత్రమే చేశారన్నారు. కృష్ణవేణి, శ్రీదేవి, సుజాత, సువార్త, శ్రీదేవి, జయశ్రీ, సుమన, పూలబాయి, పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం..

వాంకిడి: మండలంలోని డోంగర్‌గాం గ్రామానికి చెందిన ఆత్రం దేవుబాయి అనే బాలింత ఇటీవల రక్తహీనతతో మృతి చెందగా కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాంనాయక్ ఆమె కుటుంబ సభ్యులను శనివారం పరామర్శించి నిత్యావసర సరకులు అందజేశారు.

- వాంకిడి మండలంలోని సోనాపూర్, వెల్గి గ్రామాల్లో ఆదికర్మయోగి అభియాన్‌పై అధికారులు అవగాహన సదస్సులు నిర్వహించారు.
- వాంకిడి మండలంలోని బంబార గిరిజన ఆశ్రమ పాఠశాలను ఎంపీడీవో ఖాజా అజీజుద్దీన్ తనిఖీ చేశారు.

సిర్పూర్(యు): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు, విద్యార్థులు తయారు చేసిన టీచింగ్ లర్నింగ్ మెటీరియల్ ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామకృష్ణ ఉన్నారు.

పెంచికలపేట: విద్యార్థులకు గుణాత్మక విద్యను బోధించాలని ఏసీఎంవో ఉద్ధవ్ అన్నారు. మండలంలోని ఎల్లూరు ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి

ఆసిఫాబాద్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధనాన్ని అమలు చేయాలని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానందంగౌడ్ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఎస్టీయూ భవనంలో ఏర్పాటు చేసిన జిల్లా కౌన్సిల్ సమావేశానికి అయన పాల్గొని మాట్లాడారు. అనంతరం ఎస్టీయూ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పుర్క మానిక్‌రావు, ప్రధాన కార్యదర్శిగా తుకారాం, గౌరవ అధ్యక్షుడిగా సంతోష్, ఉపాధ్యక్షులుగా లక్ష్మణ్, అన్నపూర్ణ, అదనపు ప్రధాన కార్యదర్శిగా బాదిరావు, కార్యదర్శులుగా మున్వర్ అహ్మద్, శారద, స్రవంతి, కోశాధికారిగా నగేష్‌లను ఎన్నుకు న్నారు. సమావేశంలో ఎస్టీయూ నాయకులు సంజీవ్‌కుమార్, లక్ష్మణ్, సంతోష్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

11న వాక్ ఇన్ ఇంటర్వ్యూలు

ఆసిఫాబాద్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ వైద్య విదానపరిషత్ జిల్లా పర్యవేక్షణ అధికారి పరిధిలోని సిర్పూర్(టి), బెజ్జూరు, కాగజ్‌నగర్, తిర్యాణి, వాంకిడి, జైనూరు కేస్ స్పెషలిస్టు గైనకాలజిస్ట్, పీడీయాట్రిక్, జనరల్ మెడిసిన్, ఎంబీబీఎస్ జనరల్ డ్యూటీ డాక్టర్ పోస్టులు కాంట్రాక్టు పద్ధతిన భర్తీ చేయడానికి ఈ నెల 11న వాక్-ఇన్- ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు డీసీహెచ్ఎస్ డాక్టర్ అవినాష్‌కుమార్ అరిశె ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు సంబంధిత ధ్రువపత్రాలతో నేరుగా ఇంట ర్వ్యూకి హాజరుకావాలని కోరారు. స్పెషలిస్టు డాక్టర్లకు లక్ష రూపాయలు, డాక్టర్లకు రూ.52,351 వేతనం చెల్లించనున్నట్లు తెలిపారు.

నాణ్యమైన సరుకులు అందించాలి

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు నాణ్యమైన సరుకులు అందించాలని ఫుడ్ సెఫ్టీ స్టాండర్డ్ అథారిటీ ఆఫ్ ఇండియా శిక్షకురాలు కంచాల భార్గవి తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాలులో దుకాణదారులకు, హోటల్ నిర్వహకులకు ఎంసీఈడీ(మహరాష్ట్ర సెంటర్ ఆఫ్ అంత్ర పెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్) ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ వ్యాపార సముదాయాలను పరిశుభ్రంగా ఉంచేలా చూడాలన్నారు. సమావేశంలో ఎం సీఈడీ జిల్లా కో అర్డినేటర్ అచ్యుత్ కుమార్, రీజినల్ కో ఆర్డినేటర్లు శ్రీనివాస్, మహేందర్‌రెడ్డి సభ్యులు మహేష్, విజయ్‌కుమార్, బానుచందర్ తదితరులు పాల్గొన్నారు.

వాగుదాటి.. పాఠశాలలను సందర్శించి..



అనార్‌పల్లి వాగు దాటుతున్న ఎంఈవో ప్రకాష్

కెరమెరి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనార్‌పల్లి వాగును మండల విద్యాధికారి ప్రకాష్ మోకాళ్ల లోతు నీళ్లలో నడుచుకుం టూ దాటి పాఠశాలలను సందర్శించారు. వాగు అవతలి వైపున ఉన్న శంకర్‌గూడ, బోరిలాల్‌గూడ గ్రామాల్లోని పాఠశాలను తనిఖీ చేశారు. ఆయా పాఠశాలల రికార్డులను పరిశీలించారు. వర్షాలు తగ్గిన నేపథ్యంలో జ్వరాలు ప్రబలే ఆస్కారం ఉందన్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాల ని ఉపాధ్యాయులకు సూచించారు. పీఎం జుగా(ప్రధాన్‌మంత్రి జన్‌జతియా ఉన్నత్ గ్రామ్ అభియాన్) కార్యక్రమంలో భాగంగా గిరిజనుల స్థితిగతులను తెలుసుకున్నారు.

లబ్ధిదారులకు మంజూరు పత్రాల పంపిణీ



లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే హరీష్‌బాబు

దహెగాం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రైతు వేదికలో 37 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు శనివారం మంజూరు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెసరికుంట, మొట్లగూడ గ్రామపంచాయతీ భవనాలు జాతీయ గ్రామీణ ఉపాధి హామి పథకం కింద మంజూరయ్యాయని, త్వరలోనే వాటికి శంకుస్థాపన చేస్తామని తెలిపారు. కల్వాడ, ఒడ్డుగూడ, మధ్య డబుల్ రోడ్డు, పీపీ రావు కాలనీ నుంచి సుర్దాపూర్ మధ్య బీటీ రోడ్డు మంజూరయ్యాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేందర్, తహసీల్దార్ షరీఫ్, ఎంపీవో రవికుమార్, పీఏసీఎస్ చైర్మన్ తిరుపతిగౌడ్, బీజేపీ నాయకులు ధనుంజయ్, దామోదర్, ప్రభాకర్‌గౌడ్, డైరెక్టర్ శ్రీనివాస్, శంకర్, శంకర్‌గౌడ్, సత్తయ్య, శ్రీనివాస్‌గౌడ్, సంజీవ్, సత్యం, ఇస్తారి, వనజ, రోషన్, వెంకన్న, సురేష్‌గౌడ్, రాజు, రాకేష్, సదయ్య, శ్రీకాంత్, రాజన్న, వెంకన్న, పరమేశ్, మల్లేష్, లక్మాజీ, అహ్మద్ పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు అందజేత

జైనూర్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో టీచర్స్ డే సందర్భంగా విశేష ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలతో పాటు బహుమతులను హెచ్‌ఎం పార్వతీబాయి శనివారం అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హెచ్‌ఎం మాట్లాడుతూ ఉపాధ్యాయులు బోధించిన పాఠాలను చక్కగా చదువు కుంటూ ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. రానున్న పది పరీక్షల్లో వంద శాతం ఫలితాలు సాధించేలా కృషి చేయాలని కోరారు.

దహెగాం: మండలంలోని కుంచవెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



జైనూర్‌లో విద్యార్థులకు బహుతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

విద్యార్థులకు మౌలిక వసతుల కల్పనకు చర్యలు

ఆసిఫాబాద్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యో): కుమరంభీం ఆసిఫాబాద్ అకాంక్షిత జిల్లా తిర్యాణి బ్లాక్‌లో అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పాఠశాలల్లో, కళాశాలల్లో మౌళిక వసతులపై ఇంజనీరింగ్ అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణలపై పురోగతి సాధించాలని కేంద్రాల నిర్మాణానికి స్థలాల కోసం స్థానిక తహసీల్దార్‌తో సమన్వయం చేసుకొని స్థలాలను గుర్తించాలన్నారు. సమావేశంలో జిల్లా సంక్షేమాధికారి భాస్కర్, పీఆర్ ఈఈ ఆజ్మీర కృష్ణ, అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీని కలిసిన డీఎస్పీ

కాగజ్‌నగర్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ డీఎస్పీ వహిదుద్దీన్ శనివారం ఎమ్మెల్సీ దండే విఠల్‌ను కలిశారు. ఈ సందర్భంగా పుష్ప గుచ్ఛం అందజేశారు. అలాగే పట్టణ సమస్యలపై కాసేపు చర్చించారు. అనంతరం సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబును మర్యాదపూర్వకంగా కలిశారు.

గణపతి నిమజ్జనంలో అపశృతి

- గోదావరిలో యువకుడి గల్లంతు


రాజేష్ యాదవ్

జైపూర్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా ఇందారం బ్రిడ్జిపై వినాయక నిమజ్జనంలో శనివారం తెల్లవారుజామున అపశృతి చోటుచేసుకుంది. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన రాజేష్ యాదవ్(25) అనే యువకుడు బ్రిడ్జిపైనుంచి గోదావరిలో పడి గల్లంతయ్యాడు. జైపూర్ ఎస్ఐ శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. రాజేష్ యాదవ్ తోటి మిత్రులతో కలిసి గణపతి విగ్రహాన్ని నిమజ్జనం చేసేందుకు ఇందారం బ్రిడ్జిపైకి వచ్చాడు. ట్రాక్టర్‌లో ఉన్న విగ్రహాన్ని క్రేన్ సహాయంతో నిమజ్జనం చేసే క్రమంలో నిద్ర మత్తులో ఉన్న రాజేష్ యాదవ్ అదుపు తప్పి గోదావరిలో పడి గల్లంతయ్యాడు. యువకుడి కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టినా ఎలాంటి ఆచూకీ లభించలేదు. గోదావరి పరివాహక గ్రామాలైన ఇందారం, టేకుమట్ల, శెట్‌పల్లి, బెజ్జా, కుందారంలోని మత్స్యకారులకు, రైతులకు, యువకులకు ఎవరైనా రాజేష్ యాదవ్ ఆచూకీ తెలిస్తే 8712656551 నంబర్‌కు తెలియజేయాలని ఎస్ఐ సూచించారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి యువకుడి మృతి

జన్నారం, సెప్టెంబరు6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మారం, బాదంపల్లి గ్రామాల మధ్యలో గల రహదారిపై ద్విచక్రవాహనం అదుపుతప్పిన ఘటనలో ఒకరు మృతి చెందారు.. వివరాల్లోకి వెళితే జగిత్యాల జిల్లా బీర్‌పూర్ గ్రామానికి చెందిన పూదూరు నరేశ్(20), పూదూరి విష్ణువర్ధన్‌లు కలిసి మండలంలోని బాదంపల్లి గ్రామంలో గల వారి సోదరి ఇంటికి వెళ్లారు. మళ్లీ స్వగ్రామానికి తిరుగు ప్రయాణంలో ధర్మారం, బాదంపల్లి వద్ద అర్ధరాత్రి అతివేగంతో ద్విచక్రవాహనం నడుపడంతో అదుపుతప్పి గుంతలోకి దూసుకుపోయింది. దీంతో పూదూరి నరేశ్ తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుక కూర్చున్న విష్ణువర్ధన్‌కు తీవ్రగాయాలు కావడంతో జగిత్యాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు నరేశ్ తండ్రి గంగన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసుకున్నట్లు ఎస్ఐ అనూష తెలిపారు.

చిరుతపులి దాడిలో లేగదూడ మృతి

హాజీపూర్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): చిరుతపులి దాడిలో లేగదూడ మృతి చెందిన ఘటన మండలంలోని ముల్కల్ల అటవీ ప్రాంతంలో చోటు చేసుకుంది. అటవీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం పాత మంచిర్యాల సెక్షన్ పరిధిలోని ముల్కల్ల అటవీ ప్రాంతంలో మేత కోసం వెళ్లి లేగదూడపై శుక్రవారం సాయంత్రం చిరుతపులి దాడి చేసింది. ఈ ఘటనలో లేగదూడ అక్కడికక్కడే మృతి చెందింది. గడ్‌పూర్ గ్రామానికి చెందిన చిప్పకుర్తి ప్రసాద్‌కు చెందిన లేగదూడగా గుర్తించారు. సంఘటన స్థలంలో కెమెరాలను అమర్చిన అటవీశాఖ అధికారులు పాదముద్రలు గమనించి అది చిరుతపులిగా ధృవీకరించారు. అడవి ప్రాంతంలో పులి, చిరుతపులి తిరుగుతున్నందున సమీప గ్రామాల ప్రజలు అడవి ప్రాంతంలోకి వెళ్లకుండా పశువులను అడవుల్లోకి పంపించకుండా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లక్షెట్టిపేట క్షేత్ర అధికారి అనిత, బీట్ ఆఫీసర్లు రాజేందర్, ఖలీం, రాజులు పాల్గొన్నారు.

108లో ప్రసవం

కౌటాల, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): కౌటాల మండలం బాలెపల్లికి చెందిన గర్భిణి చునార్కర్ సులభ శనివారం 108 అంబులెన్స్‌లో ప్రసవించింది. పురిటి నొప్పులు అధికం కావడంతో కుటుంబసభ్యులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. ఈఎంటీ విజయ్, పైలెట్ సురేష్ సిర్పూర్(టి)కి తరలిస్తుండగా మార్గమధ్యలో ఆడ శిశువుకు జన్మనిచ్చింది. అనంతరం తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారని, సిర్పూర్(టి) ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందిస్తున్నట్లు తెలిపారు.



వేతన వెతలు

● మూడు నెలలుగా జీతాల పెండింగ్ ● ఇబ్బందుల్లో కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికులు

కాగజ్‌నగర్ టౌన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): చాలీచాలని వేతనాలతో నెట్టుకొస్తున్న కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికుల పరిస్థితి దయనీయంగా తయారైంది. కాగజ్‌నగర్ మున్సిపల్ కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులకు మూడు నెలలుగా వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నారు. పూటగడవక అప్పులు చేయాల్సి వస్తోంది. ఈ విషయంలో స్థానిక ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు, ఎమ్మెల్సీ దండె విఠల్‌ను కలిసి విన్న వించారు. నోటీసులు, వినతిపత్రాలు అందిస్తున్నా ఏ నెల కూడా సక్రమంగా వేతనాలు తమకు రావడం లేదని వారు వాపోతున్నారు.

ప్రతీ సారి పండుగ పూట పస్తులు ఉండాల్సిన పరిస్థితులు నెల కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ పిల్లలకు పాఠశాలలు ప్రారంభ మయినప్పటి నుంచి పుస్తకాలు, దుస్తులు, పాఠశాల ఫీజులు కట్టలేక ఇబ్బందులు పడుతున్నారు. కుటుంబ పోషణ భారమై నెలవారీ ఇంటి ఖర్చులు, కిరాణా సరుకుల కోసం అప్పులు చేయాల్సి వస్తోంది. అలాగే దీంతో పాటు 1.5 కోట్ల రూపాయల పీఎఫ్ బకాయిలు న్నట్లు కాంట్రాక్టు పారిశుధ్య కార్మికుల సంఘం అధ్యక్షుడు శంకర్ పేర్కొంటున్నారు. మే నెలలో సమ్మె నోటీసులు అందించి, ఆందో ళన చేశామని అప్పుడు ఒక్క నెల వేతనం అందించారన్నారు. తిరిగి జూన్, జూలై, ఆగస్టు నెలల వేతనం ఇవ్వాల్సి ఉందని ఎవరూ పట్టించుకోవడం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

భద్రత కరువు

కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ జమ చేయకపోవడం వలన వ్యాధుల బారిన పడిన కార్మికు లకు ఇబ్బందులు ఎదు రవుతున్నాయి. వేతనాల్లో కోత విధిం చిన ఈఎస్ఐ కాంట్రి బ్యూషన్ నెలవారీగా ఆయా సంస్థలకు చెల్లించాలని ఆందోళన చేసిన ప్రతీ సారి చెప్పినా ఫలితం ఉండడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈఎస్ఐ చెల్లింపులు లేకపోవడంతో కార్మికుల కుటుంబసభ్యులకు చికిత్సకు దూరం అయ్యారని, వెంటనే ఈఎస్ఐ, పీఎఫ్ బకాయిలు చెల్లించాలని కోరుతున్నారు. ప్రతీ యేట ఆందోళన బాట పట్టందే వేతనాలు చెల్లించడం లేదని కార్మికులు ఆరోపిస్తు న్నారు. ప్రస్తుతం కూడా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు వినతి పత్రాలు ఇవ్వడం జరిగిందనీ, గణేష్ నవరాత్రులు, నిమజ్జనం తదితర పండుగల దృష్ట్యా సమ్మె ఆలోచన విరమించుకోవాలని వారు సూచించడంతో కార్మిక సంఘం నాయకులు వెనక్కి తగ్గారు. రానున్న దసరా, దీపావళి పండుగలను దృష్టిలో ఉంచుకొని వెంటనే తమ వేతనాలు మంజూరు అయ్యేలా కృషిచేయాలని కోరుతున్నారు.

196 కుటుంబాలకు నిత్యం నరకమే

కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో కాంట్రాక్టు పద్ధతిలో 141 మంది పారిశుధ్య, 55 మంది విద్యుత్, మంచినీరు, బిల్లులు వసూళ్ల, కార్యాలయ సిబ్బంది, తదితర పనులు చేస్తున్నారు. వీరికి నెలనెలా వేతనాలు అందక పోవడంతో పాటు జీతాల నుంచి ఈఎస్ఐ, పీఎఫ్ కోత విధిస్తున్నారు. కానీ డబ్బులు జమ చేయకపోవడంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతీసారి సమ్మె చేయందే జీతాలు చెల్లించడం లేదు. నిధుల కొరత కారణంగా వేతనాలు చెల్లించలేని పరిస్థితి ఉందని అధికారులు పేర్కొంటున్నారు. గతంలోనూ ఈఎస్ఐ, పీఎఫ్ పేరిట కోత విధించిన డబ్బులు జమ చేయాలని మొర పెట్టుకున్నా పట్టించుకోవడం లేదు. దీంతో కార్మిక కుటుంబాలకు భద్రత కరువైంది.

సమ్మె చేయందే వేతనాలు ఇవ్వడం లేదు

ఇరిగిరాల శంకర్, అధ్యక్షుడు, తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయు)



ప్రతీ సారి సమ్మె చేయందే వేతనాలు ఇవ్వని పరిస్థితి ఉంది. కాగజ్‌నగర్ మున్సిపల్ కాంట్రాక్టు పారిశుధ్య కార్మికుల పరిస్థితి దయనీయంగా ఉంది. కలెక్టర్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)లకు వినతి పత్రాలు అందించాం. ఎమ్మెల్యేని కలిసి మొరపెట్టుకోగా సీడీఎంఎతో మాట్లాడారు. అదనపు నిధులు మంజూరు చేస్తే తప్ప జీతాలు ఇవ్వలేని దుస్థితి ఉంది. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు చొరవ తీసుకొని సమస్య పరిష్కారం కోసం కృషి చేయాలి. కుటుంబ పోషణ భారంగా మారింది.

జేకే యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

ఆసిఫాబాద్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్టణంలోని సిర్పూర్ పేపర్ మిల్లు జేకే యజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సీపీఐ నాయకులు శనివారం కలెక్టరేట్ ఏవో కిరణ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. మిల్లులో వెంటనే ఎన్నికలను నిర్వహించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. యజమాన్యం వింత పోకడలకు వెళ్తోందని, కార్మికుల భద్రతను పట్టించుకోకుండా వారి జీవితాలతో చెలగాటం ఆడుతోందని, కార్మికుల విజ్ఞప్తులను, ఆందోళనలను భేఖాతరు చేస్తోందని విమర్శించారు. వెంటనే జేకే పేపర్ మిల్లు యాజమన్యాంపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు చిరంజీవి, దివాకర్ పాల్గొన్నారు.

స్థానిక సంస్థల పోలింగ్ స్టేషన్ల డ్రాఫ్ట్ లిస్టు ప్రదర్శన

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): త్వరలో నిర్వహించనున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ స్టేషన్ల డ్రాఫ్ట్ లిస్టులను ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిబంధనతో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి ఇప్పటికే ఓటరు జాబితా విడుదల చేశామని తాజగా పోలింగ్ స్టేషన్ల జాబితా కూడా అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. జాబితాపై అభ్యంతరాలు ఉంటే వెంటనే తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో మౌనిక, సిబ్బంది బాలేశ్వర్, అదిత్య తదితరులు పాల్గొన్నారు.

బెజ్జూరు: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండల, జిల్లా పరిషత్ ఓటరు, పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితాను ఎంపీడీవో గౌరి శంకర్ శనివారం ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏమైనా గ్రామ పంచాయతీల వార్డులు తప్పినట్లయితే అభ్యంతరాలు ఉంటే ఈనెల 8లోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ వైకుంఠం, కార్యదర్శి వసంత్, జూనియర్ అసిస్టెంట్ సురేష్, పాల్గొన్నారు.

పోరాటాలతో తప్పుడు విధానాలను తిప్పి కొట్టాలి

కెరమెరి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): పాలకుల తప్పుడు విధానాలను పోరాటాలతో తిప్ప కొట్టాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ అన్నారు. శనివారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధా నాలను తిప్పికొట్టడానికి పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. నాయకుడు ఆనంద్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ముట్టడి విజయవంతం చేయండి

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వృద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు పింఛన్ పెంచాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో ఈనెల 8న కలెక్టరేట్ ముట్టడి నిర్వహించనున్నట్లు ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్ నాయకులు థామస్, రేగుంట కేశవరావు, శ్రీశైలం తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో సమావేశంలో మాట్లాడారు. ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా తిరుపతి

పెంచికలపేట, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పెంచికలపేట తహసీల్దార్‌గా తిరుపతి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా తహసీల్దార్‌ను డీటీ చిన్ను, మాజీ సర్పంచ్ చంద్రమౌళి, నాయకులు రమేష్, కాంతారావు, రెవెన్యూ సిబ్బంది తదితరులు సన్మానించారు.

విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి


మాట్లాడుతున్న జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ కార్యదర్శి యువరాజ్

వాంకిడి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): చట్టాలపై విద్యార్థు లు అవగాహన కలిగి ఉండాలిని జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ కార్యదర్శి యువరాజ్ సూచించారు. మహిళల హక్కులను పరిరక్షిస్తున్న పలు చట్టాలపై శనివారం మండలంలోని బెండార సమీపంలోని ఆదర్శ డిగ్రీ కళాశా లలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వరకట్న వేధింపులు, బాల్య వివాహాల నిషేధం, లింగసమానత్వం, ప్రాథమిక హక్కులు, నూతనంగా అమలులోకి వచ్చిన పలు చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్య, శిక్షణ, ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో మహిళలను బలపరిచేందుకు సంకల్ప్ మహిళాసాధికారిక కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. సంకల్ప్ హబ్ ద్వారా విద్యా సంస్థలు, శిక్షణ కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాలలో మహిళలకు వివిధ అంశాలపై, చట్టాలపై అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు. మహిళలు వేధింపు లకు గురైతే 1098,181,112,14567,1930,1908,100 నంబర్లకు ఫోన్ చేయాలని పోలీసులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకుంటారని సూచించారు. కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ అధికారి భాస్కర్, జిల్లా మహిళాసాధికారత కేంద్రం సమన్వయ కర్త బి. శారద, డిగ్రీ కళాశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ దేవేందర్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రయ్య, డిహెచ్‌ఈడబ్ల్యూ సిబ్బంది, కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎంసీఎల్ స్టడీ టూర్‌కు యూనియన్ ప్రతినిధులు

శ్రీరాంపూర్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో మహానది కోల్ ఫీల్డ్స్ లిమిటెడ్ స్టడీ టూర్‌కు గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు తరలివెళ్లనున్నారు. ఈ నెల 8, 9 తేదీల్లో పర్యటించి అక్కడి బొగ్గు గనుల్లో ఉత్పత్తి విధానాలు, కొత్త బొగ్గు బ్లాకుల వేలం, మార్కెటింగ్, నాణ్యత పెంపు, ఉత్పత్తిలో మహిళల భాగస్వామ్యం, మానవ వనరులు, పనిగంటల వినియోగం, యంత్రాలు, వాటిని ఉపయోగించే సమయాలను ఆయా యూనియన్ల ప్రతినిధుల బృందం పరిశీలిస్తుంది. పర్యటనకు ఎంపికైన వారిలో ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కె రాజ్‌కుమార్, ఉప ప్రధాన కార్యదర్శి ముష్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శులు షేక్ బాజీసైదా, వై. రాంగోపాల్, ఎం రమేష్, ఐఎన్‌టీయూసీ సీనియర్ ఉపాధ్యక్షులు సి త్యాగరాజన్, కాంపెల్లి సమ్మయ్య, జెట్టి శంకర్‌రావు, ప్రధాన కార్యదర్శి ఎండీ అక్రమ్ ఉన్నారు.

సింగరేణి నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

శ్రీరాంపూర్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి ఏర్పాటు చేయాలనే సింగరేణి నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రాంచందర్‌రావు, ఉప ప్రధాన కార్యదర్శి వేణుమాధవ్ ఒక ప్రకటనలో తెలిపారు. కొన్నేళ్లుగా వైద్యం పొందేందుకు విశ్రాంత ఉద్యోగులు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, ఖమ్మం, తదితర పట్టణాల్లో నివసిస్తున్న వారు వైద్యం కోసం తాము పనిచేసిన ప్రాంతాల్లో ఉన్న సింగరేణి ఆస్పత్రులకు వెళ్తున్నారన్నారు.

బీపీ, షుగర్, ఇతర మందులు తీసుకుంటున్నారన్నారు. వయస్సుతో పాటు తక్కువ పెన్షన్ వలన తమ నివాస ప్రాంతాల నుంచి దూరంగా ఉన్న సింగరేణి ఆస్పత్రులకు వెళ్లడం ఇబ్బందికరంగా ఉందన్నారు. కార్పొరేట్ వైద్యం కోసం సింగరేణి యాజమాన్యం కోట్ల రూపాయలు కార్పొరేట్ ఆస్పత్రులకు చెల్లిస్తోందన్నారు. వీటన్నింటికి చెక్ పెడుతూ సింగరేణి ఆధ్వర్యంలోనే సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఏర్పాటు కోసం టెండర్ ఆహ్వానించడం హర్షించదగిన విషయమని కొనియాడారు. ఆస్పత్రి ఏర్పాటైతే ఎంతో సౌకర్యంగా ఉటుందని తెలిపారు. ఈ విషయంలో సీఎండీకి కృతజ్ఞతలు తెలుపు తున్నట్లు వారు పేర్కొన్నారు. అలాగే సింగరేణి ఆస్పత్రుల్లో వైద్యం పొందితే సీపీఆర్ఎంఎస్ కార్డు నుంచి 40 శాతం కోత విధించడం నిలిపివేస్తామని సీఎండీ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని నాయకులు కోరారు.

సొంతింటి కల కోసం.. అభిప్రాయ సేకరణలో పాల్గొనండి

- లాభాల వాటా చెల్లించాలని ఈనెల 15న ధర్నా - సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి


ఐకే1ఏ గని వద్ద బ్యాలెట్ నమూనా పోస్టర్లను విడుదల చేస్తున్న తుమ్మల రాజారెడ్డి

జైపూర్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సొంతింటి కల కోసం జరిగే అభిప్రాయ సేకరణలో పాల్గొనాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి సూచించారు. శనివారం శ్రీరాంపూర్ ఏరియాలోని ఐకే1ఏ గనిలో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ నెల 15వ తేదీన లాభాలు ప్రకటించి 35 శాతం చెల్లించాలని డిమాండ్‌చేస్తూ అన్ని జీఎం కార్యాలయాల ఎదుట చేపట్టే ధర్నాలను విజయవంతం చేయాలన్నారు. ఈ నెల 11, 12తేదీల్లో సొంతింటి పథకంపై సీఐటీయూ నిర్వహిస్తున్న అభిప్రాయ సేకరణలో నమూనా బ్యాలెట్ నిర్వహిస్తున్నందున యూనియన్లకు అతీతంగా కార్మికులు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ప్రభుత్వం సొంతింటి కల నెరవేర్చకపోతే దీర్ఘకాలిక పోరాటాలకు సిద్ధమనే సూచనలను పంపించాలన్నారు. ఒకవైపు ప్రతిపక్షాల ఆందోళనలు, ధర్నాలకు పిలుపునిస్తుంటే దసరా పండగ దగ్గరకు వస్తున్నా ఇంకా లాభాల వాటా ప్రకటించకపోవడం గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలకు సిగ్గు చేటన్నారు. వాస్తవ లాభాలను ప్రకటించి వెంటనే వాటా చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం బ్యాలెట్ నమూనా పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో బ్రాంచ్ అధ్యక్షుడు బాలాజీ, కస్తూరి చంద్రశేఖర్, వెంగళ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మందమర్రిటౌన్: సింగరేణిలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి యాజమాన్యం లాభాల వాటా ప్రకటించి 35 శాతం చెల్లించాలని సీఐటీయూ బ్రాంచ్ కార్యదర్శి వెంకటస్వామి, రాజేందర్‌లు తెలిపారు. శనివారం సివిల్ డిపార్టుమెంట్‌లో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో వారు మాట్లాడారు. ఆర్థిక సంవత్సరం ముగిసి ఆరు నెలలు గడుస్తున్నా ఇంత వరకు లాభాల వాటా చెల్లించకపోవడం దారుణమన్నారు. కార్మికులు ఎన్నో ఏళ్లుగా సొంతింటి కోసం ఎదురు చూస్తున్నారని దీన్ని వెంటనే అమలు చేయాలని కోరారు. దీనిపై బ్యాలెట్ ద్వారా కార్మికుల అభిప్రాయ సేకరించనున్నామని తెలిపారు. అలవెన్స్‌లపై ఐటీ మాఫీ తదితర సమస్యలను పరిష్కరించాలన్నారు. సింగరేణిలో గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలు పూర్తిగా విఫలమయ్యాయన్నారు. డిమాండ్ల సాధన కోసం తమ యూనియన్ పోరాటాలు చేస్తుందని తెలిపారు. అనంతరం బ్యాలెట్ నమూనా పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

గాయపడిన కార్మికుడికి పరామర్శ

శ్రీరాంపూర్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఎస్ఆర్‌పీ 3 గనిలో పనిచేస్తున్న బదిలీ వర్కర్ కె. రాజేష్‌ను ఏఐటీయూసీ నాయకులు రామకృష్ణాపూర్ ఏరియా ఆస్పత్రిలో శనివారం పరామర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ, ఖాళీ డబ్బులను గులాయి నుంచి అబేస్(పైకి) పంపే క్రమంలో ట్రామర్‌కు సహాయం చేయాలని అండర్ మేనేజర్ సూచించారన్నారు. తనకు లైన్ రిపోర్టు ఉందని చెప్పినా పట్టించుకోకుండా టబ్బులు పట్టుకోవాలని బలవంతం చేశారని ఆరోపించారు. తాడు జట్కా రావడంతో రాజేష్ కింద పడిపోవడంతో చేయి విరిగిందన్నారు. అయితే రాజేష్ నడుచుకుంటూ వెళ్తూ జారిపడ్డాడని తప్పుడు రిపోర్టు తయారు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మళ్లీ ఇలాంటి చర్యలకు పాల్పడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

కార్మికుడిని పరామర్శించిన వారిలో ఉప ప్రధాన కార్యదర్శి ముష్కె సమ్మయ్య, కేంద్ర కార్యదర్శి అక్బర్ అలీ, శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి షేక్ బాజీసైదా, ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్ రావు, జీఎం కమిటీ చర్చల ప్రతినిధులు సంపత్, బుచ్చయ్య, పిట్ కార్యదర్శి గునిగంటి నర్సింగ్ రావు, ట్రేడ్స్‌మెన్ ఇన్‌చార్జి సురేష్, తదితరులున్నారు.

రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించాలి

కాసిపేట, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కార్మికులు రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించాలని మందమర్రి జీఎం రాధాకృష్ణ అన్నారు. శనివారం కాసిపేట2వ గనిని ఆయన సందర్శించి మాట్లాడారు. సింగరేణిలో గైర్హాజరు శాతాన్ని తగ్గించి బొగ్గు ఉత్పత్తి సాధించేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం పనిస్థలాలను పరిశీలించి తగు సూచనలు తెలియజేశారు. మొదటిసారిగా గనికి వచ్చిన జీఎంను అధికారులు, కార్మికసంఘాల నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో గని మేనేజర్ లక్ష్మీనారాయణ, కేకే గ్రూపు ఏజెంటు రాంబాబు, గ్రూపు ఇంజనీర్ రామ్‌ప్రసాద్, సేఫ్టీ ఆఫీసర్ రవిశంకర్, వెల్ఫేర్ ఆఫీసర్ భార్గవ్, గుర్తింపు సంఘం నాయకులు కృష్ణచారి, నర్సయ్య, వెంకటేష్, రాజకొమురయ్య, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.


కాసిపేట 2వ గనిలో మాట్లాడుతున్న జీఎం రాధాకృష్ణ

క్వార్టర్ల కేటాయింపులపై 'విజిలెన్స్' ఆరా

మందమర్రిటౌన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మందమర్రి ఏరియాలో క్వార్టర్ల కేటాయింపుపై విజిలెన్స్ అధికారులు ఆరా తీస్తున్నట్లు సమాచారం. కొద్ది కాలంగా ఎన్‌సీడబ్ల్యుఏ ఉద్యోగులతో పాటు ఉద్యోగులకు కౌన్సెలిం గ్ ద్వారానే క్వార్టర్ల కేటాయింపు ప్రక్రియను మందమర్రిలో యాజమాన్యం శ్రీకారం చుట్టింది. కానీ కొంత మంది యూనియన్ నాయకులతో అధికారులు కుమ్మక్కై కౌన్సెలింగ్ నిర్వహించకుండగానే వారికి నచ్చిన క్వార్టర్లను అలాట్‌మెంట్ చేసినట్లు కొందరు ఉద్యోగులు విజిలెన్స్ విభాగానికి ఫిర్యాదు చేశారు. నాలుగైదు రోజులుగా మందమర్రిలో విజిలెన్స్ విభాగం అధికారులు క్వార్టర్ల కేటాయింపు వెనుక ఎవరెవరి పాత్ర ఉందనే విషయంపై ఆరా తీస్తున్నట్లు, ఇప్పటికే మందమర్రి ఏరియాలోని గనిని సందర్శించి క్వార్టర్ల కేటాంపుపై వివరాలు సేకరించినట్లు సమాచారం.

స్థానిక జీఎం కార్యాలయంలో గతంలో క్వార్టర్ల కేటాయింపు విభాగానికి బాధ్యులుగా ఉన్న అధికారిపై ఈ కేటాయింపులపై ఆరోపణలు వస్తు న్నాయి. ఆయన ఇటీవలనే కొత్తగూడెం కార్పొరేట్‌కు బది లీపై వెళ్లారు. ఏరియాకు సంబంధించి పైస్థాయి నుంచి మొదలుకొని కింది స్థాయి అధికారుల వరకు సంతకాలు పెట్టిన అనంతరం గనుల, డిపార్ట్‌మెంట్ల వారీగా క్వార్టర్ల కేటాయింపులు జరుగుతాయి. దాదాపు 20కిపైగా క్వార్టర్లు కౌన్సెలింగ్ లేకుండానే పంపిణీ జరిగినట్లు విజిలెన్స్ దృష్టికి వెళ్లినట్లు తెలుస్తోంది. క్వార్టర్ల కుంభకోణంలో ఎవరెవరు ఉన్నారనే విషయాన్ని సేకరించి వారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో చర్చనీయాంశంగా మారింది. కౌన్సెలింగ్ ద్వారా కేటాయించాల్సిన క్వార్టర్లు పైరవీల ద్వారా కేటాయిస్తున్నారని సింగరేణి ఉద్యోగులు మండిపడుతున్నారు.



సంస్థ అభివృద్ధికి కృషి చేయాలి

మందమర్రిటౌన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు చేస్తామని, సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని మందమర్రి జీఎం రాధాకృష్ణ తెలిపారు. శనివారం ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు జీఎంను కలిసి శాలువాలతో సన్మానించారు. జీఎం మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరం ఏరియాకు నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలతో పాటు అదనపు ఉత్పత్తిని సాధించాలన్నారు. ఏరియాను లాభాల దిశగా నడిపించేందుకు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. నాయకులు తిరుపతి, సుదర్శన్, పురుషోత్తం, శ్రీనివాస్, శంకర్, సతీష్, పోశం పాల్గొన్నారు.


జీఎంను సన్మానిస్తున్న నాయకులు

తొలగించిన జేఎంఈటీలకు మరో అవకాశం

- తిరిగి ఉద్యోగం కల్పించేందుకు ఉత్తర్వులు

- 43 మందికి మళ్లీ ఉద్యోగం

శ్రీరాంపూర్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థలో పనిచేస్తూ వేర్వేరు కారణాలతో తొలగించబడిన జూనియర్ మైనింగ్ ఇంజనీర్(జేఎంఈటీ)లను యాజమాన్యం పునర్నియమించనుంది. ఈ మేరకు సీఎండీ ఎన్ బలరాం శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో 43 మంది జేఎంఈటీలు విధులకు హాజరుకాకపోవడం, అవసరమైన ధ్రువపత్రాలు సమర్పించకపోవడంతో విధులనుంచి తొలగించారు. వీరిని తిరిగి విధుల్లోకి తీసుకునే అంశంపై ఇటీవల డిప్యూటీ లేబర్ కమిషనర్, సింగరేణి యాజమాన్యం, సింగరేణి గుర్తింపు సంఘం(ఏఐటీయూసీ) నడుమ త్రైపాక్షిక ఒప్పందం జరిగింది. దీనిని అనుసరించి వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవడం కోసం యాజమాన్యం శనివారం ఉత్తర్వులు ఇచ్చింది. అందులోని నిబంధనల ప్రకారం.. జేఎంఈటీలకు ఇది తాజా నియామకంగా గుర్తిస్తారు. వీరంతా సంస్థ ఏర్పాటు చేసే హైపవర్ కమిటీ ముందుకు వెళ్లి తమ వివరాలు, ఓవర్‌మెన్ సర్టిఫికెట్, గ్యాస్ టెస్టింగ్, ఫస్ట్ ఎయిడ్ సర్టిఫికెట్ మొదలైనవి సమర్పించాల్సి ఉంటుంది. అనంతరం కమిటీ సూచనల మేరకు మెడికల్ ఫిట్‌నెస్ పరీక్షలకు హాజరు కావాల్సి ఉంటుంది. దాని ఆధారంగా ప్రాథమికంగా అపాయింట్‌మెంట్ ఆర్డర్ జారీ చేస్తారు. ఉద్యోగంలో చేరిన వారు మొదటి ఏడాదిలో 190 మస్టర్లుకు తగ్గకుండా విధులు నిర్వర్తించాలి.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- ఎన్. బలరాం, సింగరేణి సీఎండీ



సింగరేణి సంస్థ కల్పించే ఈ అవకాశాన్ని జేఎంఈటీలు సద్వినియోగం చేసుకోవాలి. త్రైపాక్షిక ఒప్పందం ప్రకారం.. 24-07-2025 నాటికి తొలగించబడిన జేఎంఈటీల వయస్సు 45 ఏళ్లకంటే తక్కువ ఉండాలి. హైపవర్ కమిటీలో దరఖాస్తు చేసుకొని మెడికల్ టెస్టులలో ఫిట్ అయిన వారికి జేఎంఈటీ గ్రేడ్-సీగా అవకాశం కల్పిస్తాం. ఉద్యోగంలో చేరిన తరువాత క్రమశిక్షణతో పనిచేస్తూ 190 మస్టర్లు పూర్తి చేసుకోవాలి.



ఇల్లు జిగేల్

ఆదివారం ప్రత్యేకం

అదిరిపోయేలా ఇంటీరియర్ డిజైన్స్

లక్షల్లో వెచ్చిస్తున్న ఇంటి యజమానులు

మంచిర్యాలక్రైం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం మార్కెట్లో ఇంటీరియర్ డిజైన్స్ హవా నడుస్తోంది. కోట్ల రూపాయలు పెట్టి కట్టించుకుంటున్న ఇంటికి లక్షల రూపాయలు పెట్టి అందులో ఇంటీరియర్ డిజైన్స్ చేపిస్తున్నారు. చూసేందుకు ఎంతో హుందాగా కనిపించేలా రకరకాల డిజైన్లను ఎంచుకుంటున్నారు ఇంటి యజమానులు. యజమానులకు తగ్గట్టుగానే మార్కెట్లో కూడా ఇంటీరియర్ డిజైన్స్ చేసే వారు సైతం ఎక్కువ మంది అందుబాటులో ఉన్నారు. ఎంచుకున్న డిజైన్స్‌ను బట్టి ధరలు నిర్ణయిస్తారు. కప్‌బోర్డులతో పాటు మంచి డెకరేషన్, లైటింగ్, ఇంటి ముందు గార్డెన్‌లను ఏర్పాటు చేస్తున్నారు. మంచిర్యాలలోనే కాకుండా ఇంటీరియర్స్ కోసం హైదరాబాద్ నుంచి ప్రత్యేక డిజైనర్లను పిలిపించుకొని ప్రత్యేక డిజైన్లను ఎంచుకుంటున్నారు. ఇంటీరియర్ డిజైన్స్‌కు సంబంధించి ప్రత్యేక కథనం..

గ్యాలరీ వాల్...

హాల్‌లో లేదా బెడ్‌రూం, బాల్కనీల్లోని ఫొటోలు, కళాకండాలను ప్రదర్శించడానికి గ్యాలరీవాల్ ఎంతో ఉపయోగపడుతుంది. వివిధ ఫ్రేంలను, పరిమాణాలను ఉపయోగించి ఒక ప్రత్యేకమైన రూపాన్ని సృష్టించవచ్చు. గ్యాలరీవాల్‌తో పాటు మిర్రర్స్ అద్దాల గదిని పెద్దదిగా, ప్రకాశవంతంగా కనిపించేలా చేస్తాయి. అంతేకాకుండా కర్టెన్లు, ఇంటి గదిని రంగుల మయం చేస్తాయి.

ఫర్నీచర్ అమరిక...

గది విస్తీర్ణం ఆధారంగా ఫర్నీచర్‌ను ఎంపిక చేసు కోవాలి. గది విస్తీర్ణం చిన్నగా ఉంటే ఒక సోఫా, ఒక కుర్చీ ఒక టేబుల్‌ను పెట్టుకోవచ్చు. అదే గది పెద్దగా ఉంటే కాఫీ టేబుల్ కొన్ని స్టైలిష్‌గా ఉండే కుర్చీలను కూడా అదనంగా ఏర్పాటు చేసుకోవచ్చు. ఫర్నీచర్‌ను గది గోడలకు అనించి పెట్టకూడదు.

అందంగా బాల్కనీ ..

ఇంటిలో కాసేపు సేద తీరాలన్నా.. సాయంకాలం ఒక కాఫీ తాగి విశ్రాంతి తీసుకోవాలన్నా బాల్కనీయే సరైన ప్లేస్. బాల్కనీలో ఆకర్షణీయంగా కనిపించాలంటే మీ అభిరుచులకు తగ్గట్టు పూల మొక్కలను, తీగ మొక్కలను ఎంచుకోవాలి. వాటిని నీటుగా ఉంచేందు కు ప్రత్యేక శ్రద్ధ చూపాలి. హ్యాంగింగ్‌లైట్స్, ఫైరీ లైట్లు అమర్చుకోవాలి. దీని వల్ల బాల్కని ఎంతో అందంగా కనిపిస్తోంది. స్థలాన్ని బట్టి, విస్తీర్ణాన్ని బట్టి డెకరేట్ చేసుకోవడం మంచిది.



ఎలివేషన్ టైల్స్‌తో ఇంటికి మరింత అందం

ప్రతి ఇంటికి ఇంటీరియర్స్‌తో ఎలివేషన్ టైల్స్‌తో ఇంటికి మరింత అందాన్ని చేకూరుస్తుంది. ఇంటికి వేసిన కలర్‌ను బట్టి వెలివేషన్‌ను డిజైన్ చేసుకోవాల్సి ఉంటుంది. వెలివేషన్ డిజైన్ ప్రకారం టైల్స్‌లో ఎంపిక చేసుకోవాలి. అప్పుడే ఇంటి ముందు చూపరులను ఆకర్షిస్తుంది.

లివింగ్‌రూంకు ప్రాధాన్యం..

ఇంటికి వచ్చిన అతిథులను ముందుగా ఆకట్టుకునేది లివింగ్‌రూం. ఇలాంటి లివింగ్ రూంను ఆకర్షణీయంగా తీర్చిదిద్దుకోవాలంటే నిపుణుల సలహా ప్రకారం ఇంటీరియర్స్‌ను తయారు చేసుకోవాలి. గదిలో వస్తువులను ఎలా అమర్చుకోవాలో ముందుగా ప్లాన్ చేసుకోవాలి. గది ఎలా ఉంటుందో ముందుగా లివింగ్ రూం ఫోకస్ పాయింట్‌ను ఎంపిక చేసుకోవాలి. ఇంటిలో అడుగు పెట్టగానే అక్కడే అందరి దృష్టి పడుతుంది కాబట్టి టీవీని అమర్చు కోవచ్చు. సోఫా వెనుకాల ఏదైన పెయింటింగ్ ఏర్పాటు చేసుకోవచ్చు. ఆ ప్రాంతంలో లైటింగ్ ఎక్కువ పడేలా చూసుకుంటే ఇంటికి మరింత అందం తెచ్చిపెడుతుంది.

గార్డెన్‌తో ఆహ్లాదం...

ఇంటికి గార్డెన్ ఎంతో ఆహ్లాదాన్ని ఇస్తుంది. గార్డెన్‌లో ఇంటి ముందు భాగంలో టైల్స్ , తోట వేయడానికి ఎన్నో రకాల డిజైన్‌లు ఉన్నాయి. ఇంటి ముందు భాగాన్ని అందంగా, ఆకర్షణీయంగా కనిపించేలా చేయడానికి టైల్స్, తోటను ఉపయోగించవచ్చు.గార్డెన్‌లో టైల్స్‌ను పరిచి వివిధ ఆకృతుల్లో గార్డెన్‌లను నిర్మిస్తున్నారు. గార్డెన్‌లో టెర్రస్ మొక్కలను, గ్రీన్ గ్రాస్‌లతో ఇంటి ముందు భాగాన్ని డిజైన్ చేసుకోవాలి.

డిమాండ్ పెరిగింది...

మల్‌రాజ్ ప్రవీణ్, ఇంటీరియర్ డిజైనర్



ఇంటీరియర్స్‌కు డిమాండ్ బాగా పెరిగింది. స్థానిక ప్లైవుడ్‌తో పాటు ఇంపోర్టెడ్ ప్లైవుడ్, అఖిలిక్ సీట్ మెటీరియల్స్ వాడుతున్నారు. ఒక ఇంటికి సుమారు 3లక్షల నుంచి 50 లక్షల వరకు ఇంటీరియర్స్‌కు ఖర్చు చేస్తున్నారు. గతంలో హైదరాబాద్ పట్టణాల్లో మాత్ర మే ఉండేది. ప్రస్తుతం పట్టణాలతో పాటు పల్లెటూ ర్లకు డెకరేషన్‌కు ప్రాముఖ్యత ఇస్తున్నారు. ఆర్డర్లను బట్టి ఇంటీరియల్స్ డిజైన్ చేస్తున్నాం.



అందుబాటులో ఎన్నో రకాలు...

ఇంటీరియర్స్‌లో ప్లైవుడ్‌తో పాటు డబ్ల్యూపీసీ, ఎండీ ఎఫ్ బోర్డు, ఎస్‌డీ ఎఫ్‌ఆర్ ప్లైవుడ్, యటీవీసీ రకాలు వచ్చాయి. స్థలాన్ని బట్టి, ప్రాంతాన్ని బట్టి వీటిని వినియోగిస్తున్నారు. ముఖ్యంగా చెదలు, వేడిని తట్టుకోవడం, వాటర్‌ప్రూఫ్ ఆకర్షణీయంగా ఉండడం వంటి అంశాలను బట్టి కిచెన్‌లో, హాల్‌లో, బెడ్‌రూం, బాల్కనీల్లో ఇంటీరియర్స్ చేస్తున్నారు. చౌకగా ఉండేందుకు డబ్ల్యూపీసీలను వినియోగిస్తున్నారు. స్టీల్‌లెస్ రేకుతో తయారైన కప్‌బోర్డులను సైతం వాడుతున్నారు. స్క్వేర్‌ఫీట్‌కు రూ.300 నుంచి రూ. 6వేల వరకు ఇంటీరియల్స్‌ను చేపడుతున్నారు. ఒక్కో ఇంటికి సుమారు 3లక్షల నుంచి 50లక్షల వరకు ఇంటీరియల్స్‌కు ఖర్చు పెడుతున్నారు.

లైటింగ్‌తో లుకింగ్..

ఇల్లు ఎంత అందంగా కట్టించుకున్నా ఆ తరువాత ఇంట్లో ఏర్పాటు చేసుకునే లైటింగ్ ఇంటికి రెట్టింపు అందాన్ని తెస్తుంది. సరైన లైటింగ్ గదిని మరింత ఆహ్లాదకరంగా మారుస్తుంది. దీని కోసం ఇంటీరియర్స్ లో ఎల్ఈడీ లైట్లు, జూమర్లు, రూఫ్‌లైట్లు అందుబాటులో ఉన్నాయి. ఎక్కడ ఎలాంటి లైటింగ్ బిగించా లో ఎంచుకోవడం చాలా ముఖ్యం.



రైతులకు యూరియా అందేలా చూడండి

కలెక్టర్‌కు వినతిపత్రం అందించిన కాంగ్రెస్ నాయకులు

భీమిని, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రైతులకు తగినంత యూరియా సరఫరా చేయాలని శనివారం కాంగ్రెస్ నాయకులు కలెక్టర్ కుమార్ దీపక్‌కు వినతి పత్రం అందించారు. భీమిని, కన్నెపల్లి, నెన్నెల, వేమనపల్లి మండలాల్లో యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని యూరియా కొరత తీర్చాలని వారు వినతి పత్రంలో పేర్కొన్నారు. విన్నపాన్ని స్పందించిన కలెక్టర్ ఈ నెల 8 వ తేది 2000 యూరియా బస్తాలను పంపిణీ చేయాలని జిల్లా వ్యవసాయ అధికారికి ఆదేశించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో వేమనపల్లి మాజీ జడ్పీటీసీ సంతోష్, బెల్లంపల్లి మాజీ మర్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ మాధవరపు నర్సింగరావు, నెన్నెల మాజీ ఎంపీటీసీ బొమ్మెన హరీష్ గౌడ్, భీమిని, కన్నెపల్లి పార్టీ అధ్యక్షులు గాధం లక్ష్మీనారాయణ, రామాంజనేయులు, సయ్యద్ సాబీర్ అలీ, బానేష్, శేఖర్, సతీష్ ఉన్నారు.

అమలుకు నోచుకోని కాంగ్రెస్ హామీలు...

(5వ పేజీ తరువాయి)

సన్నాహక సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి బంగ్లాలోను, మాజీ సీఎం కేసీఆర్ గడిలోనూ పుట్టి వచ్చిన నాయకులని అందుకే పింఛన్‌దారుల పక్షాన వారు నిలబడడం లేదన్నారు. ఈ నెల 9న హైద్రాబాద్‌లో జరిగే చేయూత పింఛన్‌దారుల మహాగర్జనను వాయిదా వేశామన్నారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు పాల్గొన్నారు.

పింఛన్‌దారులను పట్టించుకోని ప్రభుత్వం

తాండూర్ : రాష్ట్రంలోని పింఛన్‌దారులను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పేర్కొన్నారు. శనివారం తాండూర్‌లోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాలులో నిర్వహించిన పింఛన్‌దారుల సన్నాహక సభకు ఆయన హాజరై మాట్లాడారు. ఎన్నికల ముందు పింఛన్ పెంచుతామని చెప్పిన రేవంత్‌రెడ్డి హామీ అమలు చేడలేదన్నారు. పింఛన్‌లు పెంచకుంటే పోరాటాలను ఉధృతం చేస్తామన్నారు. అనంతరం మందకృష్ణ మాదిగను బీజేపీ నాయకులు ఘనంగా శాలువాలతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్య క్రమంలో బీజేపీ నాయకులు కొయ్యల ఏమాజీ, రామగౌని మహీధర్‌గౌడ్, చిలుముల శ్రీకృష్ణదేవరాయలు, తిరుపతి, గోవర్ధన్, శీతల్, శ్రావణ్, కుమార్, సంగీత పాల్గొన్నారు.

లడ్డూ వేలం పాట రూ.1,11,116



లడ్డూను భాజాభజంత్రీలతో తీసుకెళ్తున్న భక్తులు

మంచిర్యాలక్రైం, సెప్టెంబరు6 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణం రెడ్డి కాలనీ శ్రీరామ గణేష్ మండలి వద్ద జరిగిన లడ్డూ వేలంలో కొత్త రాణి జయప్రకాశ్ దంపతులు అమెరికాలో ఉంటున్న కొత్త శ్రీతిక్ పేరు మీద రూ.1,11,116కు లడ్డూను వేలం పాలటో దక్కించుకున్నారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు భాజాభజంత్రీలతో వారికి ఇంటి వరకు స్వాగతం పలికారు. పాత మంచిర్యాలలోని యువజన గణేష్ మండలి వద్ద పెంట రజిత రమేశ్ దంపతులు రూ.22,777లకు లడ్డూను దక్కించుకోగా, శ్రీరాజరాజేశ్వర గణేష్ మండలి వద్ద పూరేళ్ల ప్రసన్న విజయ్ క్రిష్ణ రూ.1,116కు లడ్డూను దక్కించుకున్నారు.

కుళ్లిపోయిన మృతదేహాలు లభ్యం

కోటపల్లి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పారుపెల్లి గ్రామ సమీపంలోని వంతెన పక్కన శనివారం రాత్రి మోటార్ సైకిల్‌తో పాటు కుళ్లిపోయిన ఇద్దరి మృతదేహాలు లభించినట్లు ఎస్ఐ రాజేందర్ తెలిపారు. మహారాష్ట్రలోని సిరొంచ తాలూకా తుమ్మనూరు గ్రామానికి చెందిన సిద్దు భగుర్‌సింగ్(22), నాగేష్ మెహత్రి (25) అనే ఇద్దరి యువకుల మృతదేహాలుగా గుర్తించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ నెల 3న సాయంత్రం సమయంలో చెన్నూరు నుంచి బైక్‌పై సిరొంచ వైపు వెళ్తుండగా రోడ్డు పక్కన ఉన్న వంతెనను ఢీకొని వంతెన కింద పడి పోయి తీవ్ర గాయాలతో మృతిచెందినట్లు వివరించారు. మహారాష్ట్రకు చెందిన వీరిద్దరూ ఈ నెల 3న చెన్నూరుకు రాగా తిరిగి ఇంటికి రాకపోవడంతో వారి కుటుంబీకులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మహారాష్ట్ర పోలీసులు కోటపల్లి పోలీసులకు ఇద్దరి యువకుల మిస్సింగ్‌పై సమాచారం అందించారు. దీంతో వారి ఫోన్ నెంబర్ల ట్రేస్సింగ్ ఆ ధారంగా విచారణ చేపట్టగా కొల్లూరు నుంచి పారుపెల్లి మధ్యలో ఫోన్ కాల్స్ నిలిచిపోయినట్లు తేలడంతో గాలింపు చేపట్టామన్నారు. గాలింపులో వంతెన కింద ఇద్దరు మృతిచెంది కుళ్లిపోయిన స్థితిలో ఉన్నారన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ

కాసిపేట, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండల తహసీల్దార్‌గా సునీల్‌దేశ్ పాండే శనివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన భోజన్న బదిలీపై నిర్మల్ జిల్లాకు వెళ్లగా మంచిర్యాల కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న సునీల్ దేశ్ పాండే తహసీల్దార్‌గా వచ్చారు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తానని తెలిపారు.

డ్రాఫ్ట్ ఓటరు లిస్టు ప్రదర్శన

కాసిపేట, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రెండవ సాధారణ ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో భాగంగా డ్రాఫ్ట్ ఓటరు లిస్టుల జాబితాను శనివారం ఎంపీడీవో సత్యనారాయణసింగ్ విడుదల చేశారు. ఫైనల్ ఫొటో ఓటరు జబితాను, పోలింగ్ కేంద్రాల జాబితాను విడుదల చేసి నోటీసు బోర్డులో ఉంచామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో షేక్ సప్దర్ అలీ, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం

కోటపల్లి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం జీఎస్టీని తగ్గించడం పట్ల శనివారం మండలంలోని సిర్సా గ్రామంలో బీజేపీ మండల అధ్యక్షురాలు పెద్దింటి స్వప్న పున్నచంద్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ప్రధానిమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. జీఎస్టీలను తగ్గించడంతో రైతులకు, బడుగు, బలహీన వర్గాల పేద ప్రజలకు భారం తగ్గిందని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గణేష్, జనగామ రామయ్య, గ్రామస్థులు పాల్గొన్నారు.

జిల్లా కార్యవర్గం ఎన్నిక

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ సంస్కృతిక సారధి ఉద్యోగుల సంఘం మంచిర్యాల జిల్లా కమిటీని శనివారం ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా మామిండ్ల లచ్చన్న, అధ్యక్షులుగా కొప్పర్తి సురేందర్, ఉపాధ్యక్షులుగా వెల్దూరు పోశం, ప్రధాన కార్యదర్శిగా గొడిసెల కృష్ణ, సహాయ కార్యదర్శిగా వావిలాల నాగలక్ష్మీ, కోశాధికారిగా కొప్పర్తి రవీందర్‌లను ఎన్నుకున్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వృద్ధుడి మృతి

బెల్లంపల్లి, సెప్టెంబరు6 (ఆంధ్రజ్యోతి): సోమగూడెం చర్చి వెనుకాల శనివారం రైలు ఢీకొని గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందినట్లు బెల్లంపల్లి జీఆర్‌పీ పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం చనిపోయిన వ్యక్తి నలుపు రంగుతో కూడిన పసుపు కలర్ చొక్కా వేసుకున్నాడన్నారు. మృతదేహాన్ని బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రి మార్చురిలో భద్రపరిచామన్నారు. వివరాలు తెలిసిన వారు 8712658601కు సమాచారం అందించాలన్నారు.

రేపు సమావేశం

కాసిపేట, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) :స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పార్టీల అధ్యక్షులకు ఈ నెల 8న ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సత్యనారాయణసింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11.30 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో రాజకీయ పార్టీల సమావేశం ఉంటుందన్నారు.

వెళ్లిరా..వినాయకా





మంచిర్యాలలో శోభాయాత్రలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు.. నస్పూర్ హౌసింగ్ బోర్డు కాలనీ గణపతి శోభాయాత్ర

(5వ పేజీ తరువాయి)

నిమజ్జనోత్సవ శోభాయాత్రలు శనివారం నిర్వహించారు. బాజా భజంత్రీలు, డప్పు చప్పుళ్లు, మహిళల కోలాటం నృత్యాలు భక్తుల కోలాహలం మధ్య శోభాయాత్రలు జరిగాయి. ఆయా ప్రాంతాల్లో పురవీధుల గుండా ఊరేగింపులు చేసిన అనంతరం గోదావరి నదిలో నిమజ్జనం చేశారు. గణేష్ నిమజ్జనం సందర్భంగా నస్పూర్ ఎస్సై ఉపేందర్ రావు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

దండేపల్లి: మండలంలోని పలు గ్రామాల్లోని గణ నాథులను శోభాయాత్ర చేపట్టారు. అనంతరం గూడెం గోదావరి నదిలో గణనాథులను నిమజ్జనం చేశారు. గోదావరి నదిలో వినాయక విగ్రహాలను క్రేన్ల సాయంతో నిమజ్జనం చేశారు. అంతకు ముందు యువకులు, మహిళలు కోలాటాలు చేస్తూ అలరించారు. లక్షెట్టిపేట సీఐ రమణా మూర్తి, దండేపల్లి ఎస్సై తహసినోద్దీన్, దండేపల్లి ఎంపీడీవో జే ఆర్ ప్రసాద్, సిబ్బంది పర్యవేక్షించారు.

అనారోగ్య సమస్యలతో యువకుడి ఆత్మహత్య

మందమర్రిటౌన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని యాపల్ ఏరియాకు చెందిన గంధం వేణు(32) అనారోగ్య సమస్యలతో జీవితంపై విరక్తి చెంది ఉరి వేసు కుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం వేణు కొంత కాలంగా కాలేయ సంబంధిత వ్యాధితో, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. సుమారు నాలు గేళ్ల క్రితం తల్లిదండ్రులు మరణించడంతో అప్పటి నుంచి అన్నలు, అక్క తన బాగోగులు చూసుకుం టున్నారు. శుక్రవారం రాత్రి తన సోదరుడు రమేష్‌తో కలిసి భోజనం చేసిన అనంతరం నిద్రపోతానని చెప్పి తన గదిలోకి వెళ్లాడు. శనివారం ఉదయం ఎంత సేపటికి వేణు బయటకు రాకపోవడంతో గదిలోకి వెళ్లి చూడగా ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మృతిచెందాడన్నారు. వేణుకు ఇంకా వివాహం కాలేదు. వేణు అన్న గంధం రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నేరాల నియంత్రణకే డాగ్ స్క్వాడ్

జైపూర్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : అటవీ ప్రాంతంలో జరిగే నేరాల నియంత్రణకు డాగ్ స్క్వాడ్ అందుబాటులోకి తీసుకువచ్చామని డాగ్ స్క్వాడ్ నేరాల నియంత్రణకు ఎంతో సహకరిస్తుందని జైపూర్ ఫారెస్టు సెక్షన్ అధికారి రామకృష్ణ సర్కార్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని దుబ్బపల్లి, వెంకట్రావుపల్లి గ్రామాల్లో డాగ్ స్క్వాడ్ గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఆ యన మాట్లాడుతూ అడవిలోని చెట్లను నరికినా, ఉచ్చులు బిగించిన, కరెంటు తీగలు పెట్టి అటవీ జంతువులను చంపినా ఈ డాగ్ సులభంగా నేరస్తులను గుర్తిస్తుందన్నారు ఈ కార్యక్రమంలో ఎఫ్ బీవోలు దీక్ష, సతీష్, అనిల్, వాచర్‌లు పాల్గొన్నారు.



డాగ్ స్క్వాడ్‌పై అవగాహన కల్పిస్తున్న అటవీ అధికారులు

ప్రశాంతంగా వినాయక నిమజ్జనం

జైపూర్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : వినాయక నవరాత్రుల అనంతరం ప్రశాంతంగా వినాయక నిమజ్జనం నిర్వహించినట్లు కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. శనివారం రాత్రి మండంలోని ఇందారం గోదావరి వంతెన వద్ద వినాయక నిమజ్జనాన్ని డీసీపీ భాస్కర్, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సంపత్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి సుమన్‌తో కలిసి పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రశాంతంగా నిమజ్జనం జరిగిందన్నారు. నిమజ్జన ప్రదేశాల్లో విద్యుత్, మత్స్యశాఖ, పోలీసు, రెవెన్యూ సంబంధిత శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేశామన్నారు. భద్రత దృష్ట్యా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడం, నిమజ్జనప్రదేశాల్లో క్రేన్‌లు, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచామన్నారు.



ఇందారం గోదావరి వద్ద నిమజ్జనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్, డీసీపీ భాస్కర్

జర్నలిస్టులకు సన్మానం

తాండూర్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : తాండూర్ వనిత సింధూర్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం తాండూర్ ఐబీలోని వాసవీ కన్యకపరమేషశ్వరి ఆలయంలో జర్నలిస్టులను ఘనంగా సన్మానించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు చంద్రశేఖర్, క్లబ్ అధ్యక్షుడు మధుసూదన్, మణికృష్ణ, మాధురి, కల్పన, నరేష్, వెంకటరమణ, సంతోష్, స్వప్న, శ్రీదేవి, శిరీష, సాహిత, సునీత పాల్గొన్నారు.

మాజీ కార్పొరేటర్‌పై.. చేయి చేసుకోవడం సరి కాదు

చెన్నూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మాజీ కౌన్సిలర్ అనిల్‌పై సీఐ దేవేందర్‌రావు చేయి చేసుకోవడం హేయమైన చర్య అని మున్నూరు కాపు సంఘం రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి గొల్లం లింగ మూర్తిపటేల్ అన్నారు. శనివారం చెన్నూరు ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చెన్నూరులో యూరియా కోసం రైతుల పక్షాన పోరాడుతున్న మాజీ కౌన్సిలర్ అనిల్‌పై సీఐ దేవేందర్‌రావు చేయి చేసుకోవడం సరైంది కాదన్నారు.

చెరువులోపడి ఒకరి మృతి

మంచిర్యాలక్రైం,సెప్టెంబరు6 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణం అండాలమ్మ కాలనీకి చెందిన మాచర్ల తిరుపతి(50) పూల కోసం వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులోపడి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం తిరుపతి తామరపూల కోస మని శుక్రవారం వెళ్లాడు. అతడు తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతకగా ఏసీసీ చెరువులో శవమై తేలాడు. పోలీసులకు సమాచారం అందించడంతో శనివారం మృతదేహాన్ని వెలికి తీసి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉంది. భార్య రజిత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ప్రమోద్‌రావు తెలిపారు.

ఉత్తమ పౌరులను తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

చెన్నూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అంగ్రాజ్‌పల్లి గ్రామంలోని వివేకానంద విద్యామందిర్ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం స్వయం పాలన దినోత్సవాన్ని నిర్వహించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తరగతి గదుల్లో పాఠాలను బోధించారు. ఈ కార్యక్రమంలో కరెస్పాండెంట్ మణికండన్‌పే, హెచ్ఎం పిట్టల రాజశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



స్వయం పాలన దినోత్సవంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

మంచిర్యాలక్రైం: మంచిర్యాల పట్టణంలో ఆవోపా ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఆవోపా ప్రధాన కార్యదర్శి ఆవోపా ప్రధాన కార్యదర్శి సిరిపురం శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు నేరెళ్ల శ్రీనివాస్, కార్యదర్శి రమేశ్, కోశాధికారి శ్రీనివాస్, నాయకులు శ్రీహరి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను సత్కరించారు.

మందమర్రిరూరల్ : నేటి సమాజానికి ఉపాధ్యాయులే మార్గనిర్దేశకులు అని ఎంఈవో దత్తుమూర్తి, ఎంపీడీవో రాజేశ్వర్‌లు పేర్కొన్నారు. శనివారం ఎంఆర్‌సీ కార్యాలయంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉత్తమ ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మజ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఆవోపా సభ్యులు

హాజీపూర్: మండలంలోని ఉత్తమ ఉపాధ్యాయులను ముల్కల్ల జడ్‌పీహైస్కూల్‌లో ఎంఈవో తిరుపతి రెడ్డి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ పేద విద్యార్థులకు ఉత్తమమైన సేవలు అందిస్తూ వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ముల్కల్ల జడ్‌పీ హైస్కూల్‌లో ఉపాధ్యాయులను సన్మానించారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా దుబ్బపల్లి ప్రాథమిక పాఠశాలకు చెందిన రాజకుమారి, దొనబండ ప్రాథమిక పాఠశాలకు చెందిన నర్సయ్య, రాపెల్లి ఉన్నత పాఠశాలకు చెందిన విశ్వప్రసాద్, నబ్బపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన శ్రీనివాస్ రెడ్డి, ముల్కల్ల పాఠశాలకు చెందిన సయ్యద్ అలీమోద్దీన్‌లను సన్మానించారు.

భీమారం: మండలంలో శనివారం ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కేజీబీవీ పాఠశాలలో స్పెషల్ ఆఫసీర్ కనకలక్ష్మీ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలు పాఠశాలల్లో ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులుపాల్గొన్నారు.







మంచిర్యాల, దండేపల్లిలో వినాయకుడి శోభాయాత్రలో మహిళల కోలాట నృత్యాలు



వెళ్లిరా.. వినాయకా

- కన్నుల పండువగా గణేషుడి నిమజ్జనం
- ఆకట్టుకున్న శోభాయాత్రలు
- నృత్యాలతో అలరించిన మహిళలు, యువకులు, చిన్నారులు

ఆదిదేవుడు వినాయకుని నిమజ్జనం శనివారం మంచిర్యాల జిల్లాకేంద్రంలో వైభవంగా జరిగింది. ముందుగా వినాయక మండపాలు, దేవాలయాల వద్ద ప్రత్యేకపూజలు నిర్వహిం చారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో గణనాథుడి శోభాయాత్రను డప్పుచప్పుళ్ల మధ్య నిర్వహిం చారు. శోభాయా త్రలో మహిళలు, చిన్నారులు, యువ కులు నృత్యాలు చేస్తూ అలరించారు. అర్చకులు, రాజకీయ నాయకులు, అధికారులు, వివిధ రంగాల ప్రముఖులు శోభా యాత్రలో పాల్గొన్నారు. పోలీసుల సూచనల మేరకు వినాయకుని వాహనాలను నడిపించారు. అనంతరం కాలేజీ రోడ్డులోని గోదావరి నదిలో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీ సులు చర్యలు తీసుకున్నారు. స్వచ్ఛంద సంస్థల సభ్యులు వలంటీర్లుగా వ్యవహరించారు.

- మంచిర్యాల కలెక్టరేట్, ఆంధ్రజ్యోతి



శోభాయాత్రలో చిన్నారుల నృత్యాలు




వినాయకుడితో సెల్ఫీ..నస్పూర్‌లో నిమజ్జనం

నృత్యాలు, కోలాటాలు

వినాయ నిమజ్జనం సందర్భంగా శనివారం మంచి ర్యాలలో వినాయకుని శోభాయాత్రలో చిన్నారులు నృత్యాలతో, మహిళలు కోలాటాలతో సందడి చేశారు. బెల్లంపల్లి చౌరస్తా, హైటెక్ సిటీ చౌరస్తా, ఐబీ చౌరస్తా ప్రధాన కూడళ్ల వద్ద నుంచి కాలేజీ రోడ్డు మొత్తం వినా యకులతో నిండిపోయింది. ఎలాంటి అవాంచనీ యసం ఘటనలు జరగకుండా ఏసీపీ ప్రకాష్ నేతృత్వంలో సీఐలు, పోలీసుల భారీబందోబస్తు నిర్వహించారు.

శోభాయాత్రలో మాజీ ఎమ్మెల్యే

మంచిర్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించిన వినా యక శోభాయాత్రలో మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాక ర్‌రావు పాల్గొన్నారు. హిందూ ఉత్సవ సమితి ఆధ్వ ర్యంలో ముఖరాం చౌరస్తాలో నిర్వహించిన శోభాయా త్రలో పాల్గొని వినాయకులను దర్శించుకున్నారు. ఆ యన వెంట బీఆర్ఎస్ రాష్ట్రనాయకుడు విజిత్ కుమార్ ఉన్నారు.

నస్పూర్ : నస్పూర్‌లో గణపతి నిమజ్జనోత్సవం రెండోరోజు శనివారం ప్రశాంతంగా జరిగింది. ఊరు శ్రీరాంపూర్, హౌసింగ్ బోర్డుకాలనీ, దొరగారి పల్లె, సీతారాంపల్లి తదితర ప్రాంతాలకు చెందిన సుమారు 12 మండళ్ల నిర్వాహకులు..

మిగతా 7వ పేజీలో



గూడెం గోదావరి నదిలో నిమజ్జనం చేస్తున్న భక్తులు



మంచిర్యాలలో శోభాయాత్రలో కోలాటాలు, ఆకట్టుకున్న వేషధారణ

నేడు చంద్రగ్రహణం..

- గూడెం సత్యదేవుడి ఆలయం మూసివేత



శ్రీసత్యనారాయణ స్వామి ఉత్సవ విగ్రహాలు

దండేపల్లి సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): గూడెం శ్రీసత్యనారాయణ స్వామి ఆలయాన్ని ఈనెల 7 ఆదివారం రాత్రి 9:55 నిమిషాల నుంచి అర్థ రాత్రి 1:25 నిమిషాల వరకు సంపూర్ణ చంద్రగ్రహణం ఉన్నందున మధ్యా హ్నం 12గంటలకు గూడెం సత్యదేవున్ని ఆలయాన్ని మూసి వేస్తున్నట్లు ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలలోపు సత్యదేవుని దర్శనం ఉంటుందని, ఉదయం 9:30 గంట లకు ఒక్కబ్యాచ్ మాత్రమే సాముహిక్రవతాలు నిర్వహించనున్నట్లు తెలి పారు. సోమవారం ఉదయం 5గంటలకు ఆలయంలో సంప్రోక్షణ అనంతరం మహానివేదన, ప్రదోషకాల పూజ నిర్వహించనున్నారు. అనం తరం ఉదయం 9:30గంటల నుంచి భక్తులకు దర్శనానికి అనుమ తించనున్నట్లు వెల్లడించారు.

జైపూర్ : సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా ఆదివారం మండలంలోని వేలాలగట్టు మల్లన్నస్వామి దేవాలయాన్ని మూసి వేస్తున్నట్లు ఆలయ ఈవో రమేష్ తెలిపారు. ఆదివారం ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మాత్రమే భక్తుల దర్శ నం కోసం ఆలయం తెరిచి ఉంచుతామని, అనంతరం సోమవారం ఉద యం 6గంటల వరకు దేవాలయంమూసివేయబడుతుందన్నారు. సోమ వారం ఆలయంలో శుద్ధి, సంప్రోక్షణచేసి అనంతరం భక్తులకు దర్శనం ఉంటుందన్నారు.

పోస్ట్ మెట్రిక్ హాస్టల్ వార్డెన్‌ను తొలగించండి..



బీసీ వెల్ఫేర్ డీడీకి వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

లక్షెట్టిపేట, సెప్టెంబర్, 6(ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట పట్టణంలోని ప్రభుత్వ బీసీ వసతిగృహ పోస్టు మెట్రిక్ హాస్టల్ వార్డెన్ శ్రీనివాస్‌ను తొలగించాలని కోరుతూ శనివారం బీసీ డీడీ పురుషోత్తం నాయక్‌కు పీడీఎస్‌యూ, యుఎస్ఎఫ్ఐ నాయకులు వినతిపత్రం అందజేసారు. స దరు వార్డెన్ విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నాడని ఈనెల 5వతేదీన బయట నుంచి వ్యక్తులు వసతిగృహంలోకి చొరబడి విద్యార్థులపై దాడి చేశారని వినతిపత్రంలో పేర్కొన్నారు. వసతిగృహం వాచ్‌మెన్ విధులు చేస్తున్నాడా లేదా? గేటు ఎందుకు తెరిచి ఉంది? వార్డెన్ ఆసమయంలో ఎక్కడ ఉన్నాడో విచారణ చేపట్టి ఇద్దరిపై చర్యలు తీసుకోవాలని డి మాండ్ చేశారు. అంతే కాకుండా రాత్రి సమయంలో వసతిగృహంలోకి వచ్చి దాడిచేసిన దుండగులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకో వాలన్నారు. ఈకార్యక్రమంలో పీడీ ఎస్‌యు నాయకులు డి.శ్రీకాంత్, ప్రభంజనం, కార్తీక్, యుఎస్ఎఫ్ఐ నాయకులు మిట్టపెల్లి తిరుపతి, గీతాంజలి, ఉన్నారు.

వందేభారత్ రైలుకు బెల్లంపల్లిలో హాల్టింగ్ ఇవ్వాలి



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

బెల్లంపల్లి, సెప్టెంబరు6 (ఆంధ్రజ్యోతి) : వందేభారత్ రైలుకు బెల్లం పల్లిలో హాల్టింగ్ ఇచ్చేందుకు పెద్దపల్లి ఎంపీ కృషి చేయాలని కాంగ్రెస్ నాయకులు అన్నారు. శనివారం విలేకరుల సమావేశంలో వారు మా ట్లాడుతూ పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ పార్లమెంటులో సింగరేణి కా ర్మికులకు పెన్షన్ పెంచాలని, అదేవిధంగా పార్లమెంటు పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పలుమార్లు మాట్లాడడం అభి నందనీ యమన్నారు. అదేవిధంగా వందేభారత్ రైలును మంచిర్యాల రైల్వేస్టేష న్‌తో పాటు బెల్లంపల్లిలో హాల్టింగ్ వచ్చే విధంగా కృషి చేయా లని కో రారు. ఎంతోమంది వ్యాపారస్థులు ప్రతిరోజు వివిధవ్యాపారాల నిమి త్తం హైదరాబాద్‌తోపాటు నాగ్‌పూర్‌కు వెళ్తున్నారని పేర్కొన్నారు. వం దేభారత్ రైలును నిలి పేందుకు కృషి చేస్తే ఎంతో మందికి మేలు జరు గుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు సూరిబాబు, రాజ లింగు, జయరాంయాదవ్, సతీష్, లక్ష్మణ్, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రాగి జావ పంపిణీ

హాజీపూర్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం, శ్రీసత్య సాయి అన్నపూర్ణ ట్రస్టు సంయుక్తంగా ప్రభుత్వ పాఠశాలలో చదు వు తున్న విద్యార్థులకోసం చేపట్టిన రాగిజావా పంపిణీ కార్య క్రమం శని వారం మండలంలోని ముల్కల్ల జడ్పీ హైస్కూల్‌లో డీఈవో యాద య్య ప్రారంభించారు. ఈసందర్భంగా డీఈవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు ఆకలితో ఉండకూడదని అల్పాహారం తినకుండా వచ్చే విద్యార్థులకు ప్రభుత్వం అందించే ఈ రాగిజావా అధిక పోషక విలువలతో కలిగిన ఆహారపదార్థాలే అని అన్నారు.

విద్యార్థులకు రక్తహీనత కలుగకుండా ఈ రాగి జావా, బెల్లం చాలా ఉపయోగపడు తుందని పేద విద్యార్థులకోసం ఏర్పాటు చేసిన కార్యక్ర మాన్ని సద్వినియోగం చేసుకొని చదువుల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో సెక్టోరియల్, మండల విద్యాధికారి తిరుపతిరెడ్డి, హెడ్ మాస్టర్ రాజేశం పాల్గొన్నారు.

ఇల్లు జిగేల్..

- అదిరిపోయేలా ఇంటీరియర్ డిజైన్స్
- లక్షల్లో వెచ్చిస్తున్న ఇంటి యజమానులు

7

లంబాడీలను ఎస్టీల నుంచి తొలగించాలనడం సరికాదు

జన్నారం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తీసివేయాలని సుప్రీంకోర్టుకు వెళ్లిన కాంగ్రెస్ ఎమ్మె ల్యే పెల్లం వెంకట్రావ్, కాంగ్రెస్ నాయకులు సోయం బాపురావులు లంబాడీల హక్కులపై కుట్రలను లంబాడీ హక్కుల జాగృతి మండల అధ్యక్షులు బానావత్ సంతోష్ నాయక్ అన్నారు. ఈ సందర్భంగా శనివా రం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ స్వార్ధ రాజకీయాలకోసం లంబాడ హక్కులను కాల రాసేందుకు కొంత మంది కాంగ్రెస్ నాయకులు కోర్టుకు వెళ్లి కక్ష పూరిత చర్యలు చేపడుతున్నారని అన్నారు.

రాష్ట్రంలో లంబాడీలంతా ఏకమై ఉద్యమానికి తెరలేపుతామని అన్నారు. లంబాడీలు ముమ్మాటికి ఎస్టీలే అని తెలంగాణ రాష్ట్రంలో 60లక్షల మంది లంబాడీలు ఉన్నారని వారి హక్కులకు భంగం కలిగిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈసమా వేశంలో నాయకులు బానావత్ రాములు నాయక్, రాజునాయక్, పవర్, శ్రీనివాస్, సాయికి రణ్, పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న లంబాడి హక్కుల జాగృతి మండల అధ్యక్షులు బానావత్ సంతోష్

ఓటరు జాబితా ప్రదర్శన



హాజీపూర్ ఎంపీపీ కార్యాలయంలో ఓటరు జాబితా ప్రదర్శిస్తున్న అధికారులు

హాజీపూర్, సెప్టెంబరు6 (ఆంధ్రజ్యోతి): పరిషత్ ఎన్నికల నిర్వ హణ ఏర్పాట్లలో భాగంగా శనివారం జిల్లా పరిషత్, మండల పరి షత్ కార్యాలయాల్లో ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రదర్శిం చా రు. ఇటీవల గ్రామ పంచాయతీల వారిగా తుదిఫొటో ఓటర్ల జాబి తా ప్రదర్శన ప్రక్రియ ముగించారు. తాజాగా పరిషత్ ఓటర్ల జా బితా షెడ్యూల్ విడుదల చేయడంతో పరిషత్ కార్యాలయాల్లో ఓటరు జాబితాను ప్రదర్శించారు.

పరిషత్ షెడ్యూల్ ఇలా...

ముసాయిదా ఓటర్ల జాబితా ప్రదర్శన పూర్తికాగా8వ తేదీన జి ల్లా, మండల స్థాయిల్లో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో స మావేశాలు, అభ్యంతరాల స్వీకరణ, 9వ తేదీన అభ్యంతరాల పరి ష్కారం, 10న అన్ని పోలింగ్ స్టేషన్‌లో తుదిపోటో ఓటరు జాబి తాలు ప్రద ర్శించాలని ఎన్నికల కమిషన్ షెడ్యూల్ ఇచ్చింది.

మందమర్రిరూరల్ : మండలంలోనిఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఓటరు జాబితాను ఎంపీడీవో రాజేశ్వర్ ప్రదర్శించారు. ఆయన మాట్లాడుతూ ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఓటరు జాబితాను ప్రద ర్శించామని దీనిపై ఏమైనా అభ్యంతరాలుంటే తెలియ జేయాల న్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

నిమజ్జనం వద్ద లైట్ల ఏర్పాటు

హాజీపూర్, సెప్టెంబరు 6 (ఆంధ్ర జ్యోతి): శుక్రవారం చీకటిలో నిమజ్జ నాలు అనేవార్త ఆంధ్రజ్యోతిలో ప్రచురిత మవడంతో అధికారులు స్పందించి శనివారం నిమజ్జనం కేంద్రం వద్ద జనరేటర్ సాయంతో లైట్లను ఏర్పాటు చేసిన మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు మండలంలోని గుడిపేట, ఎల్లంపల్లి బ్యాక్‌వాటర్‌లో చిన్న విగ్రహాల నిమజ్జనాలకు మున్సిపల్ అధికారులు, స్థానికపోలీసులు నిమజ్జనా లకు ఏర్పాటు చేశారు. శుక్రవారం నిమజ్జ నంలో భాగంగా లైట్లు ఏర్పాటు చేయక పోవడంతో నిమజ్జనాలకు వచ్చిన భక్తు లు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సెల్ ఫోన్ లైట్లు పెట్టుకొని నిమజ్జనం చేసిన సంఘటనలో శనివారం జనరేటర్ ఏర్పాటు చేసి విద్యుత్‌లైట్లు ఏర్పాటు చేశారు. దీంతో నిమజ్జనం కోసం వచ్చే భక్తులు హర్షం వ్యక్తం చేశారు.

అమలుకు నోచుకోని కాంగ్రెస్ హామీలు...

- వికలాంగులు,వృద్ధుల, వితంతువుల సమావేశంలో మంద కృష్ణమాదిగ



నస్పూర్ సమావేశంలో మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

నస్పూర్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో కాంగ్రెస్ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పడి 21నెలలు గడ స్తున్నప్పటికి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోలేదని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్య క్షుడు మంద కృష్ణమాదిగ ఆరోపించారు. నస్పూర్‌లోని సీసీసీలో శనివారం వికలాంగులు, వితంతువులు, వృద్ధు లు, ఒంటరి మహిళలు పెన్షన్‌దారుల సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా మంద కృష్ణ మాదిగ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో మేనిఫెస్టోలో వికలాంగులకు ఆరువేలు, వృద్ధులకు, వితంతువులకు నాలుగువేల పెన్షన్ ఇస్తా మని చెప్పి నేటి వరకు అమలు చేయ లేదన్నారు. ప్రతి పక్ష హోదాలో ఉన్న బీఆర్ఎస్ మాజీ సీఎం కేసీఆర్ ప్రతిపక్షపాత్ర పోషించకుండా ఫాంహౌజ్‌కే పరిమితమ య్యారన్నారు. ఏపీలో అమలు చేసినట్లు తెలం గాణలో కూడా అమలు చేయాలన్నారు. 8వ తేదీన తెలంగాణ వ్యాప్తంగా అన్ని కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు, 12నరాష్ట్ర వ్యాప్తంగా అన్ని తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నాలు నిర్వహించి వినతిపత్రాలు ఇవ్వాలని పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు, వికలాంగులు, వితంతువులు, వృద్ధులు పెన్షన్‌దారులు పాల్గొన్నారు.

పింఛన్‌లు పెంచుతారా...గద్దె దిగుతారా..?

జైపూర్ : అధికారంలోకి వచ్చిన వెంటనే పింఛన్‌లు పెంచుతామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి మాటత ప్పారని ఇప్పటికైనా పింఛన్‌లు పెంచు తారా లేదా గద్దె దిగుతారో చెప్పాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్య క్షుడు మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని దుబ్బపల్లిలో జిల్లా ప్రధాన కార్య దర్శి సుందిళ్ల మల్లేష్ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించిన చే యూత పింఛన్‌దారుల.. (తరువాయి 7లో)